సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 12-9-2024

సంపుటి: 20 సంచిక: 145

పేజీలు: 4 వెల: రూ.1




# అంతర్జాతీయ విమానయానానికి రాము రెక్కలు

- ఆసియా పసిఫిక్ ఏవియేషన్ సమిట్ లక్ష్యం
- 1944లో అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ ఏర్పాటు
- దానికి అనుబంధంగా మంత్రుల రెండో శిఖరాగ్ర సదస్సు
- మన మంత్రి కింజరాపు రాముకు చైర్మన్‌గా అపూర్వ అవకాశం

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

అంతర్జాతీయ విమానయాన రంగానికి ఆధునిక రెక్కలు తొడిగేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పరస్పర సహకారానికి సంబంధి విస్తృత చర్చలు జరిపి తీర్మానాలు ఆమోదించడం, వాటిని సభ్య దేశాలు అమల్లోకి తెచ్చేలా కృషి చేయడమే లక్ష్యంగా ఆసియా-పసిఫిక్ దేశాల మంత్రుల సమావేశంలో బుధవారం ఢిల్లీలో ప్రారంభమైంది. ఈ సమావేశాల పరంపరలో రెండోదైన ఈ సమిట్‌గా భారత్ అతిథ్యం ఇస్తుండగా.. భారత పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఈ సదస్సుకు అధ్యక్షుడిగా సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. ఆయన పేరును సింగపూర్ ప్రతిపాదించగా, మిగతా సభ్యదేశాలన్నీ బలపరచడంతో ఛైర్మన్‌గా ఎన్నికైన రాము సమావేశాల్లో ప్రారంభంలోనే అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. తద్వారా తనను ఎన్నుకున్న శ్రీకాకుళం జిల్లా కీర్తిప్రతిష్టలను అంతర్జాతీయంగా ఇనుమడింపజేశారు. చిన్న వయసులోనే ఎంపీగా ఎన్నికై రికార్డు సృష్టించిన రాము వరుసగా మూడోసారి మొన్నటి ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. అదే ఊపులో కేంద్రంలో నరేంద్ర మోదీ కేబినెట్‌లో విమానయాన శాఖ మంత్రిగా చోటు సంపాదించారు. ఆ విధంగా కేంద్ర కేబినెట్‌లో చిన్న వయస్కుడిగా మరో రికార్డు సృష్టించారు. కాగా అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఆసియా-పసిఫిక్ మంత్రుల సదస్సుకు సైతం ఛైర్మన్‌గా ఎన్నికైన ఘనత సాధించిన ఆయన ఆ గురుతర బాధ్యత చేపట్టిన పిన్నవయస్కుడిగా మరోచరిత్ర సృష్టించారు. ఆసియా-పసిఫిక్ శిఖరాగ్ర సదస్సును మొదట 2018లో చైనా రాజధాని బీజింగ్ అతిథ్యమిచ్చి నిర్వహించింది. ఆరేళ్ల తర్వాత రెండో సదస్సు బుధవారం ఢిల్లీలో ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో అసలు ఏమిటీ అసియా-పసిఫిక్ ఏవియేషన్ సదస్సు? దీని ప్రాధాన్యత ఏమిటి? లక్ష్యాలు ఏమిటి? అన్న ప్రశ్నలకు సమాధానమే ఈ కథనం.



### అంతర్జాతీయ పౌరవిమానయాన సంస్థకు అనుబంధంగా..

కొన్ని దశాబ్దాల క్రితమై గ్లోబలైజేషన్ పెరిగింది. ప్రపంచ దేశాల మధ్య సంబంధాలు విస్తృతమవుతున్నాయి. ఫలితంగా వివిధ దేశాల మధ్య జరిగే ప్రయాణాల్లో విమానయాన(ఏవియేషన్) రంగం పాత్రే కీలకంగా మారింది. అయితే ఈ రంగంలో ఒక్కో దేశానికి ఒక్కో విధానం ఉండటం వల్ల అంతర్జాతీయ ప్రయాణాలతో పాటు విమాన సర్వీసుల నిర్వహణ కష్టతరంగా మారింది. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని విమానయాన రంగంలో దేశాల మధ్య సహకార, సమన్వయం పెంచేందుకు 1944 డిసెంబర్ ఏడో తేదీన చికాగో వేదికగా అంతర్జాతీయ విమానయాన సంస్థ అంటే ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ (ఐసీఏవో) ఏర్పడింది. 1947లో ఈ సంస్థ ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా మారింది. అంతర్జాతీయ విమానయాన ప్రమాణాలు పెంచడం, భద్రతా ప్రమాణాలు కాపాడటం, విమానయానం వల్ల పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా చూడటం, దేశాల మధ్య సమన్వయం సాధించి రవాణా సౌకర్యాలు మెరుగుపడటం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాలు. ప్రారంభంలో 36 దేశాలు ఇందులో సభ్యులుగా ఉండగా, ప్రస్తుతం సభ్యదేశాల సంఖ్య 193 కు పెరిగింది. దీనికి అనుబంధంగా ప్రాంతీయ స్థాయిలో ఆసియా, పసిఫిక్ దేశాల మధ్య మరింత సహకారం పెంపొందించాలన్న లక్ష్యంతో ఈ రీజియన్‌లోని భారత్‌తో సహా 39 దేశాలు ఏకమై తొలిసారి 2018 ఫిబ్రవరిలో చైనాలోని బీజింగ్‌లో శిఖరాగ్ర సదస్సు నిర్వహించి విమానయానరంగానికి సంబంధించి పలు తీర్మానాలు చేశాయి. దానికి కొనసాగింపుగా ప్రస్తుతం న్యూఢిల్లీ వేదికగా రెండురోజులపాటు సమావేశం నిర్వహిస్తున్నాయి. బీజింగ్ సదస్సులో తీసుకున్న నిర్ణయాల అమలుతీరును సమీక్షించడంతోపాటు ఇకముందు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి తీర్మానాలు చేస్తున్నారు.

### ఆసియా-పసిఫిక్ ప్రాధాన్యత పరిరక్షణ

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎయిర్ ట్రాఫిక్(విమాన సర్వీసులు)లో అసియా-పసిఫిక్ రీజియన్ ఒక్కటే 33.41 శాతం వాటా కలిగి ఉంది. దానికి

- మిగతా 4లో



# ఫీజుల జంఝాటం!

విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఫీజ్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొనసాగిస్తామని ఎన్నికల్లో ఎన్డీయే కూటమి హామీ ఇచ్చింది. పైగా వైకాపా ప్రభుత్వం ఈ పథకంలో కొన్ని కోతలు విధించిందని, తాము మాత్రం పూర్తిస్థాయిలో ఫీజ్ రీయింబర్స్ చేస్తామని కూడా కూటమి నేతలు భరోసా ఇచ్చారు. కట్ చేస్తే.. ఎన్నికల్లో గెలిచి ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ వెంటనే రాష్ట్రస్థాయి కళాశాల యాజమాన్య సంఘం ప్రతినిధులు ప్రభుత్వ పెద్దలను కలిసి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తల్లిదండ్రుల ఖాతాల్లో కాకుండా నేరుగా కాలేజీ యాజమాన్యాల ఖాతాలకు జమ చేయాలని కోరారు. దానికి విద్యాశాఖ మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ ఇచ్చారు. కానీ విద్యాసంవత్సర మొదలై నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసెత్తడం లేదు. అసలు ఇస్తారా లేదా, ఇస్తే ఎప్పుడు ఇస్తారన్న క్లారిటీ కూడా ఇవ్వడంలేదు.

- ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఊసెత్తని రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటివరకు ఒక్క విడత కూడా చెల్లించకుండా తాత్సారం
- బకాయిలు చెల్లించాలని కళాశాల యాజమాన్యాల ఒత్తిళ్లు
- కోర్సు చివరి ఏడాదిలో ఉన్న విద్యార్థులకు ఇరకాటం
- ఇప్పటికే చాలామంది అప్పులు చేసి కడుతున్న ఉదంతాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గత ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఫీజ్ రీయింబర్స్‌మెంట్ మొత్తాలను జమ చేసేది. కాన్నీ ఎన్డీయే ప్రభుత్వం కళాశాలల ఖాతాలకు జమ చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు ఆ పని కూడా చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన పెరుగుతోంది. రీయింబర్స్‌మెంట్ ఇస్తారా.. లేదా అన్న అనుమానాలతో కొట్టుమిట్టాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబర్‌లో విడుదల కావాల్సిన రీయింబర్స్‌మెంట్ చివరి త్రైమాసిక నిధులను ఆలస్యంగా ఈ ఏడాది మార్చిలో విడుదల చేశారు. ఆ నిధులు సార్వత్రిక ఎన్నికల అనంతరం తల్లుల ఖాతాల్లో జమయ్యాయి. ఎన్నికల తర్వాత కొలువుదీరిన ఎన్డీయే సర్కారు ఇంతవరకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై ఎటువంటి ప్రకటన చేయలేదు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్(ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్)గా మార్చింది. అలాగే ఇంజినీరింగ్ కాలేజీల మినిమం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని రూ.35 వేల నుంచి రూ.43వేలకు పెంచిందే చెల్లింపుల గురించి ప్రస్తావించలేదు. ఈ నేపథ్యంలో ఆ నిధులు ఎప్పుడు విడుదల చేస్తారోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆతృతగా

- మిగతా 4లో







## ఆధ్యాత్మిక చింతనలో ఆనందం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

ప్రతి మనిషిలో ఆధ్యాత్మిక చింతన ఉండాలని, అప్పుడే మనిషి ఆనందంగా ఉండగలరని ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ పేర్కొన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని మధురానగర్ కాలనీలో బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో దేశంలో ఉండే యువతను ఏకతాటిపైకి నడిపించేందుకు వినాయక చవితి ఉత్సవాలను మహారాష్ట్రలో ప్రారంభించి దేశమంతా

- మిగతా 4లో

## న్యూకాలనీలో నవరాత్రి మహోత్సవాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గణపతి నవరాత్రుల సందర్భంగా నగరంలోని న్యూకాలనీ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పొన్నాడ నుంచి తెప్పించిన మట్టి వినాయక విగ్రహం ఆకట్టుకుంటోంది. కమిటీ సభ్యులు మాధవ్, సాయిగణేష్, లోకేష్, సాయిప్రసాద్, మహేష్, వై.చైతన్య, మను, కుమార్, మోహన్, దాలయ్య, నాని, రామమ్మ ఆధ్వర్యంలో నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.



• ఎడిటోరియల్

# భారత విద్యార్థులకు వీసా కష్టాలు

ఉన్నత విద్య కోసం మనదేశానికి చెందిన లక్షలాది విద్యార్థులు విదేశాలకు వెళ్తుంటారు. ఇదేమీ కొత్త విషయం కాదు. దశాబ్దాల తరబడి కొనసాగుతూ వస్తోంది. ఇలా వెళ్లిన వారిలో చాలామంది చదువు పూర్తి అయిన తర్వాత అక్కడే ఉద్యోగావకాశాలు వెతుక్కుని స్థిరపడిపోతున్నారు. కానీ కొన్ని దేశాలు స్టడీ వీసాల్లో భారీగా కోత విధిస్తుండటం ద్వారా భారతీయ విద్యార్థులకు గేట్లు మూసేస్తున్నాయి. భారతీయ విద్యార్థులు అమెరికా, కెనడా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా దేశాల్లో చదువుకొనేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతుంటారు. అయితే కెనడా, ఆస్ట్రేలియా వీసా నిబంధనలను కఠినతరం చేయడం ద్వారా ఇతర దేశాలు ముఖ్యంగా భారత విద్యార్థుల ఆశలు, అవకాశాలపై నీళ్లు చల్లుతున్నాయి. కెనడాలో అధికారంలో ఉన్న జస్టిన్ ట్రూడో ప్రభుత్వం కొన్నాళ్లుగా భారత వ్యతిరేక విధానాలు అవలంభిస్తోంది. ఆ క్రమంలో ఆ ప్రభుత్వం తీసుకున్న ఒక నిర్ణయం భారత విద్యార్థులపైనే ఎక్కువ ప్రభావం చూపుతుంది. విదేశీ విద్యార్థులకు వారానికి 40 గంటలు ఉన్న వర్క్ పర్మిట్‌ను ఇప్పటికే 20 గంటలకు తగ్గించిన కెనడా సర్కార్ తాజాగా భారతీయ విద్యార్థుల సంఖ్యను 50 శాతం వరకు తగ్గించాలని యోచిస్తోంది. ఈ విషయాన్ని కెనడా ఎడ్యుకేషన్ టెక్నాలజీ కంపెనీ అప్లైబోర్డ్ తాజాగా నివేదించింది. దీంతో అక్కడ చదువుకోవాలనుకునే భారతీయ విద్యార్థుల కష్టాలు మరింత పెరగనున్నాయి. చదువుకోవడానికి కెనడాకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువ శాతం భారతీయులే. అందులోనూ రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు మరీ ఎక్కువ. దేశంలో పెరుగుతున్న ఇళ్ల కొరత, నిరుద్యోగ సమస్యను అదుపు చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కెనడా ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ట్రూడో ప్రభుత్వం గత ఏడాది 4.36 లక్షల స్టడీ వీసాలు జారీచేయగా ఈ ఏడాది వీటి సంఖ్య 2.31 లక్షలకు పరిమితం చేయనున్నారు. ఈ ఏడాది మొదటి అర్ధభాగంలోనే సగం వరకు స్టడీ వీసాలు తగ్గించగా, ముందు ముందు మరింత తగ్గించే అవకాశముంది. స్టడీ వీసాల జారీని 50 శాతం తగ్గిస్తే కొంత మంది భారతీయ విద్యార్థులకే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఆ దేశంలో సుమారు మూడున్నర లక్షల మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. వారి వీసా గడువునైనా పొడిగిస్తారా లేదా అన్నది అనుమానమే. కొత్తగా వెళ్లాలనుకునేవారి అవకాశాలు కూడా సగానికి సగం తగ్గిపోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కెనడా తరహాలోనే ఆస్ట్రేలియా కూడా విదేశీ విద్యార్థులకు గేట్లు మూసేసే నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ దేశానికి కూడా భారత్ నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు స్టడీ వీసాలపై వెళ్లి ఉన్నత విద్య అభ్యసిస్తుంటారు. సంఖ్యాపరంగా భారతీయ విద్యార్థులకు ఇది మూడో గమ్యస్థానంగా చెబుతున్నారు. ఆ దేశంలో ప్రస్తుతం సుమారు 1.70 లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇంగ్లీషు మాట్లాడే దేశం కావడం, విదేశీ విద్యార్థులకు పెద్ద ఎత్తున స్కాలర్‌షిప్పులు, అత్యున్నత ఉద్యోగావకాశాలు, మంచి జీతభత్యాలు, శాశ్వత నివాసం పొందే అవకాశాలు ఉన్నందున ఆస్ట్రేలియాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. భారత్ నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా వలసలు బాగా పెరిగిపోవడంతో ఆస్ట్రేలియా వీసా పరిమితులు విధించింది. అలాగే శాశ్వత నివాసం పొందడానికి నిబంధనలు కఠినతరం చేసింది. ఆస్ట్రేలియాలో విద్యనభ్యసిస్తున్న అత్యధిక సంఖ్యాకులు భారతీయులే. అందువల్ల అక్కడి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భారీగా నష్టపోయేది కూడా మన విద్యార్థులే. దాంతో వారంతా తమకు న్యాయం చేయాలంటూ రోడ్డెక్కారు. భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. విదేశీ విద్య కోసం స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియాకు వెళ్లిన భారతీయ విద్యార్థులు తమ చదువులు ముగియగానే ఆ దేశంలోనే ఉద్యోగం సంపాదించి నివాసం ఉండటానికి మొగ్గు చూపుతూ శాశ్వత నివాసానికి అనుమతి కోరుతూ ఆ ప్రభుత్వానికి దరఖాస్తులు పెడుతున్నారు. అయితే శాశ్వత నివాసానికి సంబంధించి పరిమితులు విధించడం భారతీయ విద్యార్థులను దెబ్బకొట్టింది. తాజా నిబంధనల ప్రకారం విదేశీ విద్యార్థులు చదువు పూర్తి కాగానే ఆస్ట్రేలియాను వీడాల్సి ఉంటుంది. ఈ నిర్ణయాన్ని భారతీయ విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆ దేశంలో ప్రముఖ నగరాలైన పెర్త్, మెల్‌బోర్న్‌లలో నిరసనలు మిన్నంటాయి. శాశ్వత వీసా కోసం 12 ఏళ్లుగా ప్రయత్నించి విఫలమైన మనో యోగలింగం అనే వ్యక్తి గత నెలలో మెల్‌బోర్న్‌లో ఆత్మాహుతి చేసుకున్న తర్వాత పరిస్థితి మరింత విషమించింది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాకు వచ్చినవారు తమ తాత్కాలిక బ్రిడ్జింగ్ వీసాల పరిమితుల నుంచి తప్పించుకునేందుకు శాశ్వత నివాస అనుమతి కావాలని, వీసాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. నిరసనల్లో భాగంగా లేబర్ పార్టీ ఎంపీ నివాసాన్ని కూడా ముట్టడించారు. నెల రోజులకు పైగా హోం వ్యవహారాల మంత్రి టోనీ బర్క్ కార్యాలయం బయట ఆందోళనకారులు నిరసన దీక్ష చేశారు. దీనిపై భారత ప్రభుత్వం కూడా స్పందించి ఆస్ట్రేలియాతో సంప్రదింపులు జరిపి భారత విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. మరి భారత ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

## ఆమె నేత్రాలు సజీవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



న్యూకాలనీలో నివాసముంటున్న కిల్లంశెట్టి తవిటమ్మ మృతిచెందడంతో ఆమె నేత్రాలను దానం చేయాలని కుమారులు ఎస్ఎస్ జువెలరీస్ అధినేతలు కిల్లంశెట్టి సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్‌లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలిపారు. మగటపల్లి కళ్యాణ్ ఇండియన్ రెడ్‌క్రాస్ నేత్ర సేకరణ కేంద్రం ఐ-బ్యాంక్ టెక్నీషియన్ సుజాత, ఎన్.ఉమశంకర్ బృందం ఆమె కార్నియాలు సేకరించి విశాఖపట్నం మోసిన్ ఐ-బ్యాంక్‌కు తరలించారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ స్వచ్ఛంద నేత్రదానానికి ముందుకు వచ్చిన కిల్లంశెట్టి కుటుంబసభ్యులను అభినందించారు. తవిటమ్మ నేత్రదానం ద్వారా ఇద్దరు కార్నియల్ అంధులకు ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం కలుగుతుందన్నారు. నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నెంబరుకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

## దాడికి పాల్పడిన వ్యక్తికి రెండేళ్లు జైలు

(సత్యంన్యూస్, పలాస)

మహిళను చాకుతో గాయపర్చడమే కాకుండా ఆమె భర్తను, కుమారుడిని కర్రతో కొట్టిన ఫిర్యాదు కోర్టులో రుజువు కావడంతో ముద్దాయికి రెండేళ్లు జైలుశిక్ష, రూ.11వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జి ఎస్.ఎం.ఫణికుమార్ బుధవారం తీర్పునిచ్చారు. ఫిర్యాది తన కుటుంబంతో కలసి పూండి గోవిందపురంలో నివాసం ఉంటుంది. వారి పక్క ఇంటిలో నివాసముంటున్న అనకాపల్లి ఏర్నిబాబు తన భార్యతో ప్రతి రోజు గొడవపడుతూ కొడుతూ శారీరకంగా హింసిస్తుండేవాడు. 2019 మార్చి 10న రాత్రి ఏర్నిబాబు తన భార్యను కొట్టగా ఆమె పక్క ఇంటికి ఆ రాత్రి వచ్చి ఉండి మరుసటి రోజు తన తండ్రితో పుట్టింటికి వెళ్లిపోయింది. మరుసటి రోజు రాత్రి 11గంటల గంటల సమయంలో ఏర్నిబాబు తన పక్కింటికి వెళ్లి తలుపు కొడుతుండగా, వారు భయపడి ఇంటి వెనుక నుంచి వెళ్లిపోతుండగా ఏర్నిబాబు చాకుతో దాడి చేసి ఫిర్యాది ఎడమ అరచేయిపై గాయం చేశాడు. అడ్డుకోబోయిన ఆమె భర్త, కుమారుడిని కర్రతో కొట్టగా వీపు, ముఖంపై బలమైన గాయాలయ్యాయి. ఈమేరకు పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి ఫిర్యాదు చేశారు. అప్పటి హెచ్‌సీ 1137 వై.గవరయ్య వజ్రపుకొత్తూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నేరం నిరూపణ కావడంతో ముద్దాయికి రెండేళ్లు జైలుశిక్ష, రూ.11వేలు జరిమానా విధించారు. జరిమానా కట్టకపోతే మరో మూడు నెలలు సాధారణ జైలుశిక్ష విధిస్తూ జడ్జి ఫణికుమార్ తీర్పునిచ్చారు.

## జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ టీం చాలా అవసరం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ టీంకు అవగాహన కార్యక్రమంలో మొదటి బ్యాచ్ ముగిశాయని, వారి సేవలు చాలా అవసరమని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు విపత్తు నిర్వహణపై శిక్షణ తరగతులు స్థానిక రెడ్‌క్రాస్ స్కిల్ డెవెలప్మెంట్ ఆవరణలో జరిగాయని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ప్రక్రియలను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని, అప్పుడే ఆపదలో ఉండేవారికి సహాయపడగలమన్నారు. ఎవరికి ఏ ఆపదొచ్చినా రెడ్‌క్రాస్ అండగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవాకార్యక్రమాలలో పాల్గొనాలని, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమాజానికి సేవ చేయాలని సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు, ప్రముఖ వైద్యులు, వైస్ చైర్మన్ డాక్టర్ కె.సుధీర్‌కుమార్ అన్నారు. అగ్నిప్రమాదాలపై మెళుకువలు, ప్రమాద నివారణ చర్యలకు ఏడీఎఫ్ ఎం.వరప్రసాద్ తమ బృందంతో తర్ఫీదునిచ్చారు. రెడ్‌క్రాస్ విపత్తుల స్పందన దళాన్ని రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ ఆధ్వర్యంలో అన్నింటిపై అవగాహన కల్పించి, ప్రత్యక్షంగా ఎలా ఎదుర్కొని, సహాయపడాలో వివరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ, ఎం.కళ్యాణ్ చక్రవర్తి, బి.చిన్మయ్‌రావు, కె.కళ్యాణ్, పి.శ్రీకాంత్, హరి సత్యనారాయణ, ఎ.నర్సింగరావు, గుణాకరన్, బి.సతీష్, రెడ్‌క్రాస్ వాలంటీర్స్, పొన్నాడ రవికుమార్, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

## 14న జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ పర్యటన

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఈనెల 14న షెడ్యూల్ తెగల జాతీయ ఎస్టీ కమిషన్ హుసేన్ నాయక్ శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారని ఆదివాసి సంక్షేమ పరిశ్రమ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి తెలిపారు. జలుమూరు మండలం ఎస్టీ మాకివలస గ్రామానికి సందర్శించనున్నారు. సందర్శన అనంతరం మెళియాపుట్టి మండలం కేరసింగిగూడ గిరిజనులతో ముఖాముఖి ఉంటుందని, జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ పర్యటన ఆదివాసీ సంఘాలన్నీ హాజరై విజయవంతం చేయాలని యోగి కోరారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ సంఘం నాయకులు, బెజ్జి కృష్ణ, జన్ని దాలయ్య, మన్మధరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తరోడ్డులో ట్రాఫిక్‌జామ్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

శ్రీకాకుళం కొత్తరోడ్డులో గురువారం ఉదయం భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డులోని గుంతలో లారీ చక్రాలు ఇరుక్కుపోవడంతో గంటల పాటు రాకపోకలకు ఇబ్బంది కలిగింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అత్యవసరంగా వెళ్లాల్సిన వారు, విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు పడ్డారు.



# ఎవరైనా..ఆయన ముందు దిగదుడుపే!



ఇప్పటి తెలుగు హీరోలు ,నటులు అందరూ కూడా ఈయన ముందు దిగదుడుపే...ఎందుకంటే జీవితం చివరిలో చాల దుర్భర పరిస్థితిలో చనిపోయి ఉండొచ్చు కానీ తాను సంపాదించినా ఆస్తిలో అత్యధిక భాగం పేదవారి చదువు కోసమే వినియోగించిన అపర దానకర్ణుడు రాజనాల.. ఈయన ఎంఏ ఫిలోసోఫీ, ఎంఏ ఇంగ్లీష్ చదివిన విద్యాధికుడు... సావిత్రి లాంటి గొప్ప దానగుణ సంపన్నులు ఇంకా ఉన్నారు.. చిత్తూరి నాగయ్య, రాజబాబు, రాజనాల, రేలంగి, ప్రభాకర్ రెడ్డి లాంటి వారు ఉన్నారు. రాజనాల (జనవరి 3, 1925 - మే 21, 1998) ఇతని పూర్తి పేరు రాజనాల కాళేశ్వరరావు నాయుడు. దాదాపు నాలుగు దశాబ్దాలకుపైగా 400 పై చిలుకు చిత్రాల్లో వివిధ రకాలైన పాత్రలు పోషించాడు. తెలుగు సినిమా, నాటకాల్లో ఎక్కువగా నటించాడు. కొన్ని తమిళ, కన్నడ, హిందీ చిత్రాల్లో కూడా నటించాడు. పౌరాణిక, జానపద,సాంఘిక చిత్రాలలో కంసుడు, జరాసంధుడు, మాయల ఫకీరు, భూకామందు, దొంగల నాయకుడు లాంటి ప్రతినాయక పాత్రలలో రాణించాడు.

నెల్లూరు జిల్లా కావలికి చెందిన రాజనాల అసలు పేరు రాజ నాల కల్లయ్య (రాజనాల కాళేశ్వరరావు). ఈయన 1925, జన వరి 3న జన్మించాడు. ఇంటర్ చదువుతూనే 1948లో నెల్లూరులో స్నేహితుడు లక్ష్మీకుమార్‌రెడ్డితో కలిసి నేషనల్ ఆర్ట్స్ థియే టర్ అనే నాటక సంస్థను ప్రారంభించాడు. మొదటగా నెల్లూరు టౌన్‌హాలులో ఆచార్య ఆత్రేయ 'ఎవరు దొంగ' నాటకాన్ని ప్రదర్శిం చారు. నాటకం చూసిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ప్రభుత్వ శాఖలోని అవినీతిని బట్టబయలు చేశావంటూ రాజనాలపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఆ తరువాత 'ప్రగతి' అనే నాటకాన్ని ప్రదర్శించగా కోపగించిన కలెక్టర్ రాజనాలను సస్పెండ్ చేశారు. ఆ తరువాత ఉద్యోగం వచ్చినా ఇష్టంగా చేసేవారు కాదు.

1951లో రాజనాలకు మిత్రుడు లక్ష్మీకుమార్‌రెడ్డి నుంచి మద్రాసుకు పిలుపువచ్చింది. అప్పటికే లక్ష్మీకుమార్‌రెడ్డి నిర్మాత హెచ్. ఎం. రెడ్డి వద్ద పని చేస్తున్నారు. వారు తీసే 'ప్రతిజ్ఞ' సినిమాకు విలన్‌గా రాజనాలను ఎంపి కచేశారు. నెలకు రూ.200లు జీతానికి హెచ్‌ఎం రెడ్డితో కాంట్రాక్టు కుదుర్చు కున్నాడు. 1953లో విడుదలైన ఆ సినిమా విజయవంతమై అందరికీ మంచి పేరు తీసుకొచ్చింది. పాతికేళ్ల వయసులోనే 'వద్దంటే డబ్బు' సిని మాలో ఎన్టీఆర్‌కు మామగా ముసలి జమీందారు పాత్రలో నటించాడు. అప్పటినుంచి ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితంగా మెలిగారు. 1966లో 'మాయా ది మెగ్నిషిమెంట్' అనే హాలివుడ్ సినిమాలో నటించి, హాలివుడ్‌లో నటించిన తొలి తెలుగు నటునిగా రికార్డు సృష్టించారు. 25 ఏళ్లపాటు విలన్‌గా, హాస్యనటుడుగా తారాజువ్వలా వెలుగొందాడు.

రాజనాలా 1950, 1960లలో తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతికూల పాత్రలకు ప్రసిద్ధి చెందారు. సినిమాల్లోకి రాకముందు నాటకాలలో నటించినందుకు పలు అవార్డులు, ప్రశంసలు పొందారు. ఆ సమయంలో తెలుగు చిత్ర పరిశ్రమలో బహుముఖ నటుడు ఎన్.టి.రామారావుకు తగ్గ ప్రసిద్ధి చెందిన విలన్.రాజనాలా చాలా మంచి, నిష్పత్తిలో ఉన్న శరీరాన్ని కలిగి ఉండేవాడు. అతని ఐకానిక్ నటన ఎక్కువగా అతని కళ్ళ కదలిక ద్వారా జరిగింది. అతను ఒక విలన్ యొక్కక్రూరత్వాన్ని తన కళ్ళను చూడటం, విస్తరించడం ద్వారా వివిధ స్థాయిలకు చూపించేవాడు. అతని విలన్ నవ్వు చాలా ప్రసిద్ధి చెందింది.అతను 100 కంటే ఎక్కువ తెలుగు చిత్రాలలో విలన్ గా నటించాడు, నెల్లూరు జిల్లా నుండి మంచి నటుడిగా పేరు పొందాడు. అతను తెరపై గొప్ప ఆధిపత్య విలన్, అతను అప్పట్లో తెలుగు కథానాయకులకి తగ్గ సమానమైన వేతనం పొందేవాడు.

ముగ్గురు ముఖ్యమంత్రులతో కలిసి నటించిన మొదటి నటుడు రాజనాలా, అంటే ఎన్.టి.రామారావు, ఎం.జి.రామచంద్రన్, జె.జయలలిత.రాజనాలాకు ఇతర సినిమా పరిశ్రమ కోలీవుడ్, బాలీవుడ్లలో మంచి స్నేహితులు ఉన్నారు. మధుమేహంతో బాధపడుతుండడం వల్ల, 1995లో అరకు లోయలో తెలుగు వీర లేవరాలో సినిమాలో పూర్తిస్థాయి పాత్ర పోషిస్తున్నప్పుడు షూటింగ్ సమయంలో గాయపడిన అతని కాలిని హైదరాబాదులోని నిమ్స్ హాస్పిటల్ లో కత్తిరించాల్సి వచ్చింది. రాజనాలకు తీవ్రమైన గుండెపోటు రావడంతో చెన్నైలోని విజయ ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ 1998, మే 21న చెన్నైలో మరణించారు.

## ఇంటి పేరుపై ఏంటి ఈ కన్ఫ్యూజన్?

మలైకా అరోరా తండ్రి ఇంటిపేరుపై గందరగోళం నెలకొందా? ఒకరు అరోరా అంటే? మరొకరు మోహతా ఫ్యామిలీ మెంబర్‌గా సందేహం వ్యక్తం చేస్తున్నారా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. నిన్న మలైకా అరోరా తండ్రి అనీల్ ఆరోరా ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. మరాణానంతరం అతడి పేరు అనీల్ అరోరాగా తెరపైకి వచ్చింది. అయితే మలైకా అరోరా తండ్రిని అనీల్ మోహతా కులదీప్ మెహతగా అభివర్ణించడం నెట్టింట చర్చనీయాంగా మారింది. ఓ యూజర్ మలైకా ఇంటి పేరు అరోరా అని...ఆమె తండ్రి ఇంటి పేరు మెహతా అని రాసుకొచ్చారు. మరొకరు అనీల్ మలైకాకి సవతి తండ్రి అని అనుమానం వ్యక్తం చేసారు. ఈ నేపథ్యంలో మలైకా...అనీల్ మధ్య వయసు వ్యత్యాసాన్ని కూడా ఎత్తి చూపారు. ఇద్దరి మధ్య కేవలం 12 ఏళ్లు వ్యవధి మాత్రమే ఉంది. అనీల్ వయసు 62 కాగా...మలైకా అరోరా వయసు 50 ఏళ్లు. సవతి తండ్రి కావడంతో ఈ వ్యత్యాసం అని అంటున్నారు. సన్నిహిత వర్గాలు సైతం మలైకాకి అనీల్ సవతి తండ్రిగానే చెబుతున్నాయి. మలైకా మహారాష్ట్రలోని థానేలో జన్మించింది. ఆమె 11 సంవత్సరాల వయస్సులో ఆమె తల్లిదండ్రులు విడాకులు తీసుకున్నారు. మలైకా తల్లి, సోదరి అమృతా కలిసి చెంబూర్‌కు వెళ్లిపోయారు. ఆమె తల్లి జాయిస్ పాలీకార్ప్. ఆమె ఒక మలయాళీ క్రిస్టియన్. తండ్రి అనిల్ అరోరా పంజాబీ కుటుంబానికి ఎందిన వ్యక్తి. ఇండియన్ మర్చంట్ నేవీ ఉద్యోగి. భార్య ఇంట్లో ఉండగానే అనీల్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని భార్య పోలీసులకు తెలిపారు. అనీల్ ఇంట్లో లేని సమయంలో బయట చెప్పులను గమనించారు. దీంతో ఆమె బాల్కనీలో అతని కోసం వెతికారు. అక్కడ కనిపించలేదు. అప్పుడామె బాల్కనీ రెయిలింగ్‌పైకి వంగి కిందకు చూసే సరికి అనీల్ దూకి చనిపోయినట్లు తెలిసింది.



# ఫిలిప్పీన్స్‌ను మూడు చెరువుల నీళ్లు తాగించాడు!





మొన్న చెప్పులబజార్‌లో ఆకురౌడీని కొట్టావంట.. నిన్న కోరిలో అవిటి రౌడీని కొట్టావంట నీకోసమే చూస్తున్నామంటాడు రౌడీలలో కాస్త పెద్ద రౌడీ పాత్రలో చలపతిరావు. వెంటనే ఇంకో రౌడీ నేను పాస్తా రౌడీని.. నన్ను ఎమ్మెల్యేగారు తీసుకొచ్చారు ఈ సిటీకి అంటాడు. నేను రాయలసీమ రౌడీని.. మా చైర్మన్ గారు తీసుకొచ్చారు నన్ను ఈ రాష్ట్రానికని ఇంకో గూండా అంటాడు. నేను నైజాం దాదాని.. నాకు మేయర్ గారు మేపుతున్నారు రోజుకో మేకని అంటాడు మరో రౌడీ. వాటన్నింటికీ సమాధానంగా.. మూర్ఖులారా మీరు పేట రౌడీలు, పూట రౌడీలైతే.. నేను రాయలసీమ రుస్తుంని, నైజాం దాదాని, ఆంధ్రా గూండాని.. టోటల్‌గా ఈ స్టేట్ రౌడీనంటాడు చిరంజీవి. ఇక సినిమా పేరు చెప్పాల్సిన పన్లేద నుకోండి. అయితే, ఇదంతా ఎందుకు చెప్పుకున్నా మంటే.. మనమిప్పుడు స్టేట్‌రౌడీలో చిరంజీవి తరహాలో.. అటు అమెరికానీ.. మరోవైపు ఫిలిప్పీన్స్‌ని ప్రీస్ట్ ముసుగేసుకుని దడదడలాడించిన ఓ అంతర్జా తీయ క్రిమినల్ గురించి చెప్పుకోబోతున్నాం గనుక.

.. అవునూ, అంతర్జాతీయంగా అమెరికా, ఫిలిప్పీన్స్‌తో పాటు.. పలు దేశాలను ముప్పుతిప్పలు పెట్టి తనకు తాను దేవుడి కుమారుడిగా పరిచయం చేసుకుంటూ నేరాలకు పాల్పడ్డ అపోలో క్విబోలాయ్ కథ అంతర్జాతీయ నేర సామ్రాజ్యంలో ఇప్పుడు ట్రెండింగ్. ఎందుకంటే ఎఫ్బీఐ ఏకంగా 2 వేల మంది అధికారులను అతడిని వెతికే పనికోసం నియమించింది. అంతటి మోస్ట్ వాంటెడ్ ఆ క్విబోలాయ్.

### ఇంతకీ ఎవరా క్విబోలాయ్..?

ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టే సన్నిహిత మిత్రుడు. ఫిలిప్పీన్స్‌లో లక్షలాది మంది అనుచరులను సంపాదించుకున్న ఫిలిప్పీన్ పాస్టర్, ప్లస్ లీడర్. కింగ్ డమ్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ పేరిట నిర్వహిస్తున్న రెస్టోరేషనిస్ట్ క్యాథడ్రాల్ చర్చ్ పాస్టర్. క్విబోలాయ్‌పై మానవ అక్రమరవాణా, పిల్లలపై లైంగిక వేధింపుల నుంచి మొదలకుంటే.. స్మగ్లింగ్, నకిలీ వీసాలు, లెక్కకు మించి మోసాలకు పాల్పడుతూ చేసుకునే పెళ్లిళ్లు, మనీ లాండరింగ్ వంటి పలు కేసులు నమోదయ్యాయి. సోన్ షైన్ మీడియా నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ పేరుతో మీడియా కార్యకలాపాలతో ఫిలిప్పీన్ 16వ అధ్యక్షుడైన రోడ్రిగోతో సాన్నిహిత్యాన్ని పెంచుకుని తానాడింది ఆట, పాడింది పాట అన్న చందంగా చెలరేగిపోయిన నొటోరియస్ క్రిమినల్. తనపై వచ్చిన ఆరోపణల విషయంలో ఫిలిప్పీన్ ప్రభుత్వానికి సహకరించకపోవడంతో సెనేట్ ఆఫ్ ది ఫిలిప్పీన్స్ 2024, మార్చి 19న అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంటీరియర్ అండ్ లోకల్ గవర్నమెంట్ క్విబోలాయ్ సమాచారమందించినవారికి 1,43,32,000 రూపాయల రివార్డు అందిస్తామని 2024 జూలై 8న ప్రకటించింది. ఎట్టకేలకు 2024 సెప్టెంబర్ 8న క్విబోలాయ్‌ను అరెస్ట్ చేశాయి ఫిలిప్పీన్ పోలీస్ వర్గాలు.

### క్విబోలాయ్ నేపథ్యం!

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత లుబావో నుంచి ఫిలిప్పీన్స్‌కు బతుకుదెరువు కోసం వచ్చారు క్విబోలాయ్ తల్లిదండ్రులు. 9 మంది పిల్లల్లో అందరికంటే చిన్నవాడైన క్విబోలాయ్ ఏనాడూ తాను ఓ పాస్టర్ అయితానని అనుకోలేదు. ఏరోనాటికల్ ఇంజనీర్‌గా, పైలట్ కావాలనే కలలు కనేవాడు. యునైటెడ్ పెంటాకోస్ట్ బైబిల్ ఇనిస్టిట్యూట్‌లోనే చదువుకోవడంతో తన ఆసక్తి మారింది. అలా పాస్టర్ అయిన క్విబోలాయ్‌కి కొంతకాలం తర్వాత యునైటెడ్ పెంటాకోస్ట్ బైబిల్ ఇనిస్టిట్యూట్‌లో విభేదాలేర్పడ్డాయి. తనని పాస్టర్‌గా పక్కకు జరిపారు. 1985లో కింగ్ డమ్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ పేరుతో చర్చ్‌ను నెలకొల్పి.. తనకు తానే లీడర్‌గా, పాస్టర్ ఆఫ్ చర్చ్‌గా ప్రకటించు కున్నాడు. తను ఆ దేవుడు పంపిన దూతగా, ఆ దేవుడి కుమారుడిగా అభివర్ణించుకున్నాడు. అలా తన చర్చ్‌తో భక్తులు, అభిమానులు, అనుచరగణాన్ని సంపాదించుకున్న క్విబోలాయ్ ఏకంగా తన కింగ్ డమ్ ఆఫ్ నేషన్‌గా కూడా తన చర్చ్‌ను ప్రకటించుకుని.. తాను చేసే అక్రమ కార్యకలాపాలకు అడ్డాగా తయారుచేశాడు. మరో సమాంతర ప్రభుత్వాన్నే నడిపాడు. ప్రీస్ట్ ముసుగు వేసుకుని క్విబోలాయ్ చేస్తున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడంతో.. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ లిస్ట్‌లో చేరాడు. పరారీలో ఉంటూ పోలీసులకు, ఎఫ్బీఐకీ చిక్కకుండా తిరుగుతున్న అతగాడిపై ఇంటర్ పోల్ ఉత్తర్వులు జారీ చేశారు. 12 నుంచి 25 సంవత్సరాల వయస్సున్న బాలికలు, స్త్రీలను లైంగిక అక్రమ రవాణా చేసినందుకు యూఎస్ న్యాయ శాఖ 2021లో అతనిపై అభియోగాలు మోపింది. అతడి దగ్గర పని చేసినందుకు వారిపై లైంగిక దాడులకు పాల్పడ్డాడన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

### 74 ఎకరాల విస్తీర్ణంలో..

74 ఎకరాల విస్తీర్ణంలోని తన చర్చ్‌లో 2వేల మంది పోలీసులు సోదాలు జరిపారు. రెండు వారాల భారీ పోలీసు ఆపరేషన్ తర్వాత గానీ.. క్విబోలాయ్‌ని ఫిలిప్పీన్స్ పోలీస్ శాఖ అరెస్ట్ చేయలేకపోయింది. అంతేకాదు, ఆ సమయంలో పోలీసులు పెద్ద ప్రతిఘటనే ఎదుర్కొన్నారు. పోలీసులనే నిర్బంధించే ప్రయత్నం చేశారు క్విబోలాయ్ అనుచరులు. 75 వేల మంది ఉండగల్గే సామర్థ్యం కల్గిన స్టేడియంలో ఆ చర్చ్‌కు సంబంధించిన స్టేడియంలో సోదాల కొరకు పోలీసులు ఏకంగా హెలికాప్టర్స్ ఉపయోగించాల్సి వచ్చింది. థర్మల్ ఇమేజింగ్ రాడార్స్ వంటి పరికరాలను ఉపయోగించి క్విబోలాయ్ ఆ చర్చ్ కింద ఉన్న బంకర్‌లో దాక్కున్నట్టు గుర్తించారు. మొత్తంగా క్విబోలాయ్‌ని ఆదివారం ఎట్టకేలకు అరెస్ట్ చేశారు.

అయితే, ఇప్పటికీ క్విబోలాయ్ తాను దేవుడి కుమారుడినేనని, ఈ విశ్వానికి యజమానినేనంటూ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించడం కొసమెరుపు. అయితే, క్విబోలాయ్‌పై యూఎస్ లోనూ కేసులున్న నేపథ్యంలో అతణ్ని అక్కడికి అప్పగించే ముందు ఫిలిప్పీన్స్‌లో ప్రాసిక్యూషన్ పూర్తి కావాల్సి ఉంటుందని ప్రస్తుత ఫిలిప్పీన్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ చెప్పే మాట.

దైవాన్ని ఓ వ్యాపారంగా మార్చి.. నమ్మకాలు బలమైన మూఢ నమ్మకాలుగా తయారైనచోట ఇదిగో ఇలాంటి క్విబోలాయ్ వంటివారు.. నిత్యానందలు.. దేరాబాబాలు పుట్టుకొస్తునే ఉంటారు. దానికి దేశాలతో.. మతాలతో.. కులాలతో సంబంధం లేదు. కేవలం నమ్మకమే పెట్టుబడి.

– రమణ కొంటికర్ల







SriAaKaSa
YOUR TRUSTED PARTNER IN THE DISTANCE EDUCATION SECTOR.
Join our Earn while Learn program and get a job within 40 days after joining.
LAST DATE: AUGUST-28
91330 06999 Courses 92466 36411
10th, Intermediate
BA (all groups), B.Com, BLISc, B.SC (all groups), BBA, BCA (with Market trending specialisations)
MA (all subjects), M. Com, MBA, MCA, M. SC (All Subjects), MLISc, M.Tech
Computer Applications, Cyber Security. Digital Marketing. Hospital Management, Tourism Management

## తనిఖీ కమిటీ ఏర్పాటు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వివిధ జిల్లాల్లో కర్మాగారాల్లో ప్రమాదాలు, ఇటీవల అనకాపల్లి మండలం, అచ్యుతాపురం ఫార్మాసిటీలో ఎసెన్షి యాసైన్సెస్ అడ్వాన్స్‌డ్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారంలో జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని శ్రీకాకుళం జిల్లా లో ప్రమాదకర రసాయనాలు వాడే అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, ఆంధ్రా ఆర్గానిక్స్, మహాదాన్ అగ్రిటెక్, ఎన్ఏసీఎల్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు జిల్లాస్థాయి తనిఖీ కమిటీని ఏర్పా టు చేశారు. తనిఖీల అనంతరం నివేదికను ప్రభుత్వానికి సమర్పించడానికి జిల్లాస్థాయి తనిఖీ కమిటీలో జిల్లా స్థాయి అధికారులను నియమించారు. డిప్యూటి సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీసు, శ్రీకాకుళం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, శ్రీకాకుళం, జిల్లా అగ్నిమాపక అధికారి, శ్రీకా కుళం, డిప్యూటి ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్, విజయనగరం, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్, విశాఖపట్టణం, డిప్యూటి కమి షనర్ ఆఫ్ లేబర్, శ్రీకాకుళం మెంబర్స్‌గా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీకాకుళం వారు మెంబర్ సెక్రటరిగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కమిటీ ఏర్పాటు చేశారు. తనిఖీ నివేదికను 30 రోజుల్లో సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

## అంగన్వాడీలో పౌష్టికాహార మాసోత్సవాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

31వ డివిజన్ పరిధిలోని బొంతావీధి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు అంగన్వాడీ టీచ ర్లు నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న డివిజన్ టీడీ పీ ఇన్‌ఛార్జి విభూతి సూరిబాబు మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డలకు శ్రీరామరక్ష అని అన్నారు. గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహరం తీసుకోవాలని, అందుకు ప్రభుత్వం ఎంత గానో కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా గుడ్లు, పోష కాహారం గర్భిణీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీ పీవో శోభారాణి, సూపర్‌వైజర్ కల్యాణి, డివిజన్ నాయ కులు సకలాభక్తుల శ్రీనివాసరావు, ప్రధాన విజయరాం, అంగ న్వాడీ టీచర్లు జ్యోతి, జయకుమారి, గర్భిణిలు, బాలిం తలు పాల్గొన్నారు.



## గణపతికి విశేష పూజలు



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

తమ్మినాయుడుపేట గ్రామంలోని నాగావళి నదీతీరాన అమ్మా సంస్థాన్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మహాగణపతి విగ్రహానికి శ్రీకాకుళం నగరానికి చెందిన గోపాల్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ స్వామివారికి పలురకాల పుష్పాలతో అలంకరించి దీపదూప నైవేద్యాలు సమర్పించారు. అమ్మాసంస్థాన్ ఆలయంలో దైవకార్యక్రమం ఏది జరిగినా గోపాల్ తన వంతుగా సాయమందిస్తారు.

## విద్యార్థులంతా ఉన్నత స్థానంలో నిలవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

విద్యార్థులందరూ ఉన్నతమైన స్థానంలో నిలవాలని జేసీ ఐ ప్రతినిధులు అన్నారు. జేసీఐ వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం నగరంలోని బలగ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కన బరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను హెచ్ఎం ఆధ్వర్యంలో శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్ కుమార్, గ్రీన్‌సిటీ అధ్యక్షురాలు బెందాళం వరలక్ష్మి అంద జేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి పురస్కారాలతో గుర్తింపునిస్తే చురుకుదనంతో పాటు పోటీ తత్వం అలవర్చుకుంటారన్నారు. అన్నింటా విజయం సాధిం చి జిల్లాకు, పాఠశాలకు, తల్లితండ్రులకు, గురువులకు పేరుప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేసీఐ వారోత్సవాల ప్రాజెక్ట్ చైర్మన్ తమ్మినేని ఉషారాణి, బొడిగి మధు, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ సభ్యులు, జేసీఐ గ్రీన్‌సిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపడతాం

### కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నాగావళి నదిలో వరద వరద ఉధృతికి కోతకు గురవు తున్న పెద్ద గనగళ్లవానిపేట వద్ద సముద్ర తీర ప్రాంతాన్ని కలెక్టర్ స్వప్నల్ దినకర్, ఎమ్మెల్యే గొండు శంకర్ గురు వారం పరిశీలించారు. గ్రామస్తుల సమాచారం మేరకు కోతకు గురవుతున్న ప్రాంతాన్ని బోట్లపై వెళ్లి పరిశీలిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నదీ ప్రవా హం తన దిశను మార్చుకోవడం వల్ల సముద్ర ప్రాంతం కోతకు గురవుతుందని చెప్పారు. దీనివల్ల గ్రామానికి కూడా వరద ఉప్పు పొంచివుందని పేర్కొన్నారు. చాలా వరకు సముద్రతీరం కోతకు గురైనట్టు గుర్తించారు. సమ స్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే ఈ ప్రాం తంలో రక్షణ కూడా నిర్మాణం చేపట్టి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపుతామని కలెక్టర్, ఎమ్మెల్యే ప్రజలకు తెలిపారు. గత కొన్ని నీళ్లుగా ఈ సమస్య ఉందని, ప్రజలు ఆందోళన చెందవద్దని, అన్ని విధాలుగా అండగా ఉంటా మని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. అలాగే ఈ ప్రాంతంలో పార్కులను నిర్మించి ప్రజలకు అందుబాటు లోకి తెస్తామని చెప్పారు. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే బీచ్‌ను సుందరంగా పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మత్స్యకార గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వీరితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, మత్స్యకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

జై శ్రీమన్నారాయణ
శ్రీ క్రిష్ణ ఆన్‌లైన్ సర్వీసెస్
మావద్ద అన్ని రకముల జాబ్ అప్లికేషన్స్ ఆన్‌లైన్ చేయబడును.
సెల్: 93938 41308
రైల్వే రిజర్వేషన్లు, బస్ రిజర్వేషన్ సదుపాయం కలదు.

పేపర్ బాయ్స్
కావలెను
సంచలన సాయంకాల పత్రిక 'సత్యం'లో పని చేసేందుకు పేపర్‌బాయ్స్ కావలెను.
– సంప్రదించండి –
94414 66455

ఎం.ఇమ్రాన్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

MNM
బెంగుళూర్ అయ్యంగార్
బేకరి
BSNL ఆఫీస్ ప్రక్కన, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
సెల్: 76759 18522

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# అంతర్జాతీయ విమానయానానికి రాము రెక్కలు

(మొదటిపేజీ తరువాయి)

అనుగుణంగా ఈ ప్రాంత ప్రాధాన్యతను ఎప్పటికప్పుడు ప్రపంచానికి చాటిచెప్పడంతో పాటు తదనుగుణంగా పాసింజర్, కార్గో సేవలను పెంచడం, భద్రతా ప్రమాణాలు మెరుగుపరిచేలా మిగతా దేశాలను ఒప్పించడానికి అసియా-పసిఫిక్ సమిట్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా ఉంది. 39 సభ్య దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత మెరుగుపర్చడానికి కూడా ఈ సదస్సు కృషి చేస్తుంది. విమానయాన రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించి, వాటిని అధిగమించేందుకు గల మార్గాలను సూచిస్తుంది. విమాన ప్రయాణాల్లో ఆసియా-పసిఫిక్ ప్రాంతం వేగవంతమైన వృద్ధి సాధిస్తోంది. ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ అంచనాల ప్రకారం ఈ ప్రాంతంలో 2023లో 4.5 బిలియన్ల మంది విమాన ప్రయాణాలు చేయగా 2050 నాటికి ఆ సంఖ్య 11.5 బిలియన్లకు పెరగనుంది. ఈ అంచనాలకు అనుగుణంగా విమానాలు, సౌకర్యాలు, భద్రత ఏర్పాట్లు పెంచే దిశగా సభ్య దేశాలను మోటివేట్ చేస్తుంది. సైబర్ నేరాలు, బెదిరింపులు వంటి సరికొత్త సమస్యలను అధిగమించే విషయంలో పరస్పర సహకారాన్ని సాధించే అంశాలను చర్చించి నిర్ణయాలు తీసుకుంటుంది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో ఎయిర్ కనెక్టివిటీని అవసరాలకు అనుగుణంగా మెరుగుపరచడం, దేశాల మధ్య పర్యాటక వాణిజ్యం పెంచడంపై సదస్సు దృష్టి సారిస్తుంది. విమాన సర్వీసులు పెరిగేకొద్దీ ఎయిర్ ట్రాఫిక్ సమస్యలు పెరుగుతాయి. దీన్ని కంట్రోల్ చేసేందుకు డిజిటల్ టెక్నాలజీ, డేటా అనలిటిక్స్ వినియోగించే విషయంలో సభ్య దేశాలకు సహకరిస్తుంది. విమానయాన రంగంలో భద్రత, ప్రమాదాల నియంత్రణ అతి ముఖ్యమైనవి. వివిధ దేశాల ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థల మధ్య పూర్తి సమన్వయం ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు. దీన్ని సాధించడం కూడా ఈ సదస్సు ముఖ్య ఉద్దేశాల్లో ఒకటి. ఇలాంటి మరెన్నో అంశాలపై అసియా-పసిఫిక్ సదస్సులు చర్చించి, తీర్మానాలు చేస్తున్నారు. మళ్లీ వచ్చే సమావేశాల నాటివరకు వీటి అమలు తీరును ఆసియా-పసిఫిక్ మంత్రుల శిఖరాగ్ర సదస్సు ఛైర్మన్ హోదాలు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

**తెలుగులోనే రాము ప్రమాణం**

దేశం తరపున తనకు దక్కిన ఈ గౌరవాన్ని బాధ్యతగా స్వీకరిస్తానని మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చెప్పారు. సదస్సు ప్రారంభ వేదికపై అధ్యక్షుడిగా మాతృభాష అయిన తెలుగులోనే ప్రమాణ స్వీకారం చేసిన ఆయన అనంతరం మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యదేశాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విమానయాన రంగాన్ని సాధారణ ప్రజలకు మరింత చేరువ చేయడంతోపాటు సభ్యదేశాల మధ్య రాకపోకలను సులభతరం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో దాదాపు శతాబ్దం కిందట వాణిజ్య విమాన సేవలు ప్రారంభమయ్యాయని అంటూ 2035 నాటికి ఈ రీజియన్ ఏడాదికి 3.5 బిలియన్ల ప్రయాణికులతో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించనుందని చెప్పారు. ఆ మేరకు మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక పెట్టుబడులు, స్థిరమైన, సమతుల్య వృద్ధిని సాధించడానికి భాగస్వామ్య దేశాల మధ్య సహకారం అవసరమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత ఏవియేషన్ రంగం వేగవంతమైన పురోగతి సాధిస్తోందని వివరించారు. 2014లో ఆపరేషనల్ ఎయిర్‌పోర్టులు 74 ఉంటే.. ప్రస్తుతం వీటి సంఖ్య 157కి చేరిందని, మౌలిక సదుపాయాలు విస్తరించాయని చెప్పారు. 2047 నాటికి ఈ సంఖ్యను 350-400కి పెంచాలని యోచిస్తున్నట్టు తెలిపారు. గత దశాబ్దంలో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని, భారతీయ విమానయాన సంస్థలు తమ సేవలను గణనీయంగా విస్తరించుకున్నాయని ఆయన తెలిపారు.

# ఫీజుల జంఝాటం!

(మొదటిపేజీ తరువాయి)

ఎదురు చూస్తున్నారు. జరుగుతున్న జాప్యాన్ని ఆసరా చేసుకుని ఇప్పటికే కొన్ని కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ముక్కు పిండి ఫీజులు వసూలు చేస్తున్నాయి. పరీక్షలు రాయడానికి, కోర్సులు పూర్తయిన తర్వాత సర్టిఫికెట్లు తీసుకోడానికి ఫీజు చెల్లింపులతో యాజమాన్యాలు లింకు పెడుతున్నాయని బాధిత విద్యార్థులు చెబుతున్నారు. ఫలితంగా నానా తంటాలు పడి ఫీజులు చెల్లించి మాస పరీక్షలకు హాజరవుతున్న పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉంది. ఫీజులు చెల్లిస్తే తప్ప వార్షిక పరీక్షలకు అనుమతించేదిలేదని కాలేజీ యాజమాన్యాలు తెగేసి చెబుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులుచేసి బకాయిలు చెల్లించాల్సిన దుస్థితి.

**అప్పుడు అలా.. ఇప్పుడిలా..**

వైకాపా ప్రభుత్వం హయాంలో 2021 నుంచి 2023 విద్యా సంవత్సరం వరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి షెడ్యూల్ ప్రకారం జగనన్న విద్యాదీవెన కింద ఫీజులతో పాటు వసతి దీవెన పేరుతో హాస్టల్, మెస్ ఖర్చులు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చారు. వీటిని విద్యార్థుల తల్లిదండ్రులు కాలేజీ యాజమాన్యాలకు గడువులోగా చెల్లిస్తుండేవారు. ఇప్పటి వరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి (త్రైమాసికం) విడుదల చేస్తున్న చెల్లింపులు నిలిచిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. 2023-24 విద్యా సంవత్సరంలో అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి జిల్లాలో 50,945 మంది విద్యార్థులకు రూ. 35.17 కోట్లు ఈ ఏడాది మార్చిలోనే గత ప్రభుత్వం విడుదల చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో చెల్లింపుల ప్రక్రియ నిలిచిపోయింది. పోలింగ్ తర్వాత న్యాయస్థానం అనుమతితో ఆ మొత్తాలను విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారు. 2020-21 విద్యా సంవత్సరంలో నాలుగు విడతల్లో 67,940 మందికి రూ.97.37 కోట్లు, 2021-22లో 68,913 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నాలుగు విడతల్లో రూ.127.09 కోట్లు, 2022-23లో 53,867 మంది విద్యార్థులకు రూ.128.65 కోట్లు జమ చేశారు. ఐదేళ్ల పాలన కాలంలో పూర్తి స్థాయిలో మూడేళ్లకు మాత్రమే ఫీజు రీయంబర్స్ చేశారు. 2019-20 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు జమ చేయకుండానే టీడీపీ గద్దె దిగిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా విద్యా సంవత్సరం ముగిసిందంటూ చేతిలెత్తేసింది. దీంతో 2020లో ఇంజినీరింగ్ చివరి ఏడాది విద్యార్థులు సొంతంగా ఫీజులు చెల్లించి పరీక్షలు రాసి కోర్సు పూర్తి చేశారు.

**యాజమాన్యాల ఒత్తిళ్లు**

కాగా మొన్నటి ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంతవరకు చెల్లింపులు జరపకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ప్రతి మూడు నెలలకు చెల్లింపులు జరిపి ఉంటే ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య ఇప్పటికే మూడు విడతల చెల్లింపులు పూర్తి అయ్యేవి. కానీ ఇప్పటి వరకు ఒక్క విడత చెల్లింపు కూడా జరగలేదు. దీంతో 2023-24 విద్యా సంత్సరంలో కోర్సులు పూర్తి చేసుకోనున్న విద్యార్థుల్లో ఆందోళన ప్రారంభమైంది. ఇంజినీరింగ్ నాలుగో ఏడాది చదువుతున్న విద్యార్థులు మరో రెండు నెలల్లో వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరంతా 2021-22లో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరారు. వీరికి మొదటి ఏడాది 2021లో పూర్తిస్థాయిలో ఫీజు రీయంబర్స్‌మెంట్ జరగలేదు. చివరి ఏడాది అయిన 2024లోనూ అదే పరిస్థితి ఏర్పడింది. దీంతో వీరంతా పెద్ద మొత్తంలో ఫీజు బకాయిలు చెల్లించాల్సిన పరిస్థితి. 2021 సెప్టెంబర్‌లో మొదటి ఏడాది ఇంజినీరింగ్‌లో చేరినవారికి 2022 మార్చిలో తొలి ఫీజు రీయంబర్స్‌మెంట్ జమైంది. ఈ ఏడాది ఆగస్టులో ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులకు కూడా అదే పరిస్థితి ఎదురు కానుంది. ఒకవేళ ప్రభుత్వం కాలేజీలకు ఫీజులు జమ చేసినా అది రెండు నుంచి నాలుగో ఏడాది చదువుతున్న విద్యార్థులకు మాత్రమే పరిమితం అవుతుంది. ఈ బకాయి మొత్తాన్ని చివరి ఏడాదిలో విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రారంభమైన నాటి నుంచి ఈ తంతు కొనసాగుతోంది.

**పూర్తిస్థాయి బడ్జెటే లేదు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను కళాశాలల యజమాన్యాల ఖాతాల్లో జమచేసే ఆలోచనలో ప్రభుత్వం ఉండడంతో విద్యార్థులకు చుక్కెదురు తప్పదని ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టలేదు. నాలుగు నెలల కాలానికి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను అమలు చేస్తుండగా, అందులో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత లేదు. ఐటీఐ నుంచి ఐఐటీ, వైద్యవిద్య వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం అర్హత ఉన్న విద్యార్థులంతా ఎదురు చూస్తున్నారు. వైకాపా హయాంలో ప్రవేశపెట్టిన కొన్ని విధానాలపై ఎన్డీయే ప్రభుత్వం పునఃసమీక్ష చేస్తుండడం వల్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని, ఇది చివరి ఏడాది విద్యార్థులకు ఇబ్బందికరంగా మారనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఆధ్యాత్మిక చింతనలో ఆనందం

(మొదటిపేజీ తరువాయి)

విస్తృతం చేయగలిగారని, అప్పటివరకు ఎవరి ఇళ్లల్లో వారు మాత్రమే ఈ ఉత్సవాలు చేసుకొనేవారన్నారు. కుల, మత, ప్రాంత బేధాలతో సంబంధం లేకుండా దేశంలో పౌరులంతా ఒక్కటిగా ఉండేందుకు ఇటువంటి ఉత్సవాలు దోహదం చేస్తాయన్నారు. మధురానగర్ కాలనీలో చిన్నారులు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించి ఆహుతులను అలరించారు. కార్యక్రమంలో జేసీస్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు మణిశర్మ, అనీల్, ఈవెంట్స్ మేనేజర్ సాయిబాబా, డ్యాన్స్ డైరెక్టర్ సునీత, బి.సాయికుమార్, శ్రీనివాసరెడ్డి, వినాయకచవితి ఉత్సవ కమిటీ సభ్యులు జాడ సాయి, డాక్టర్ రామం, రోహిత్, వేణు, మోహన్, జతిన్, దినేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.






# విజిలెన్స్ ఎస్పీ బాధ్యతల స్వీకరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


జిల్లా విజిలెన్స్ ఎస్పీగా బర్ల ప్రసాదరావు గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీగా ప్రమోషన్ పొందిన ఆయన ఇటీవల జరిగిన నియామకాల్లో శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా పోస్టింగ్ పొందారు. ఆ మేరకు జిల్లా విజిలెన్స్ ఎస్పీ కార్యాలయంలో ప్రస్తుతం విజిలెన్స్ ఎస్పీ సురేష్‌బాబు నుంచి పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లాస్థాయి విజిలెన్స్ సమావేశంలో పాల్గొన్నారు. గతంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పని చేసిన అనుభవం ఉన్న బర్ల ప్రసాదరావు జిల్లాపై మంచి అవగాహన ఉంది. దీనికి ముందు ఆయన ఏఎస్పీ హోదాలో రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్(డీజీపీ) కార్యాలయంలో పోలీస్ కంప్యూటర్ ఆర్గనైజేషన్‌ను పర్యవేక్షించారు.



# ఏఎన్ఎంపై చర్యలు తీసుకోండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆశా కార్యకర్తపై వేధింపులకు పాల్పడిన ఏఎన్ఎంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, అధ్యక్షులు డి.ధనలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి. తేజేశ్వరరావులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం జేసీ. డీఎంహెచ్ఓలకు వినతిపత్రం అందజేశారు. టెక్కలి మండలం కె.కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశా కార్యకర్తగా పని చేస్తున్న సనపల సరస్వతిని టెక్కలి సచివాలయం-3, పీహెచ్‌సీ ఏఎన్ఎం బి.హేమలత వేధింపులు భరించలేక ఆశా కార్యకర్త ఆత్మహత్య ప్రయత్నం చేసుకొని, టెక్కలి ఏరియా ఆసుపత్రిలో చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుందన్నారు. దీనికి కారణమైన ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు.



# పెట్టుబడి సాయం రూ.20వేలు జమ చేయాలి

(సత్యంన్యూస్, టెక్కలి)

ఎన్నికలకు మందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కమిటీ నాయకులు బగాది వాసుదేవరావు, బొడ్డేపల్లి మల్లయ్య కోరారు. గురువారం లింగాలవలస గ్రామ సచివాలయంలో సిబ్బందికు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పెండింగులో ఉన్న ప్రాజెక్టులుకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేయాలన్నారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ సంపతిరావు ఉమాపతి, సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు గుర్తింపు కార్డులు



(సత్యంన్యూస్, రాజాం)

బొడ్డాం ఎంపీయూపీ స్కూల్లో 60మంది విద్యార్థులకు రాజాంకు చెందిన పారిశ్రామిక వేత్త కొత్తా అనంతరావు, చంద్రావతి దంపతులు సమకూర్చిన విద్యార్థి గుర్తింపుకార్డులను గురువారం రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్, కొత్తా సౌందర్య, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, మానవతా సెక్రటరీ ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్‌లు అందించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటుగా క్రమశిక్షణ, ఉన్నత విలువలను కలిగి ఉండాలని సూచించారు. జీవితంలో ఉత్తమ గమ్యాన్ని చేరడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హైమావతి, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ ఆదిత్యలో ఘనంగా ప్రోగ్రామర్స్ డే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ప్రోగ్రామర్స్ దినోత్సవంను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ కంప్యూటర్ ప్రోగ్రామర్ అనేది ఐటీరంగంలో ముఖ్యభూమిక పోషిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రోగ్రామ్స్ మీద బాగా అవగాహన ఉన్న విద్యార్థులనే కంపెనీలు ఎంపిక చేస్తున్నాయని తెలిపారు. కళాశాలలో అందించే కోడింగ్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనివల్ల అత్యుత్తమ క్యాంపస్ కొలువులను సాధించవచ్చున్నారు. కళాశాలలో ప్రోగ్రామర్స్ డే సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, కంప్యూటర్స్ విభాగాధిపతి ఎల్.ప్రసాద్, విద్యార్థినిలు పాల్గొన్నారు.




# ఆడవరంలో పోతన జయంతి

(సత్యంన్యూస్, గార)



ఆడవరం ప్రాథమిక పాఠశాలలో పోతన జయంతి ఉత్సవం ప్రధానోపాధ్యాయులు భోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యోదా, కేశిని, గాయత్రి, గగణ, జీవన్, మోహిత్ విద్యార్థులతో భాగవతంలో రచించిన పలికెడిది భాగవతమట, అమ్మా మన్నుదినంగనే, అమ్మలగన్నయమ్మ, శారద నీరదేందు, చేతులూరంగ శివుని పూజింపడేని పద్యాలను రాగయుక్తంగా చదివించారు. కార్యక్రమంలో సహాయ ఉపాధ్యాయులు సోనిమి పాపారావు తదితరులు పాల్గొన్నారు. పోతన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


# డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉద్యోగ ప్రకటన పూర్తి అసంబద్ధం

- జర్నలిజం విద్యార్హతలను పరిగణలోకి తీసుకోవాలి - కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయాలి
- శ్రీకాకుళం జిల్లా జర్నలిస్ట్ సంఘాల ఐక్యవేదిక విజ్ఞప్తి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర మంత్రుల పేసీల తరపున సమాచార సంబంధిత సేవలందించేందుకు ఆంధ్రప్రదేశ్ డిజిటల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఇటీవల జారీచేసిన ఉద్యోగ ప్రకటనలో విద్యార్హతలు పూర్తి అసంబద్ధంగా ఉన్నాయని శ్రీకాకుళం జిల్లా జర్నలిస్ట్ సంఘాల ఐక్యవేదిక ఖండించింది. సోషల్ మీడియా-ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్లు ఉద్యోగాల నియామకానికి ప్రభుత్వం తరపున డిజిటల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జారీ చేసిన ప్రకటన అధికారుల అవగాహన రాహిత్యం, అనుభరాహిత్యానికి నిదర్శనంగా ఉందని ఐక్య వేదిక పతినిధులు ఎస్.జోగినాయుడు, కె.వేణుగోపాల్, అల్లు యుగంధర్, జి.షణ్ముకరావు, బి.ప్రసాదరావు, ఎం.వి. సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా నిరంతరం వార్తలను ప్రసారం చేసే అనుభవం, చురుకుదనం ఇతర డిగ్రీల కంటే జర్నలిజం డిగ్రీలు పూర్తి చేసినవారికి ఉంటుందని, అటువంటి వారికి అవకాశం ఇవ్వకుండా ప్రకటన జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను వేగ వంతంగా, నాణ్యతాయుతంగా ప్రజలకు అందించడంలో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ అంశంలో డిప్లొమో లు, పీజీలు చేసినవారు సమర్థవంతంగా పనిచేయగలరని, కాని ఈ ప్రకటనలో వారికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం శోచనీయమని ఐక్యవేదిక ప్రతినిధులు ఖండించారు. తాజాగా జారీ చేసిన ఉద్యోగ ప్రకటనను రద్దు చేయడం లేదా సవరించడం చేసి జర్నలిజం కోర్సుల పూర్తిచేసిన వారికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిజం విద్యార్థులు తరపున ఐక్యవేదిక చేస్తున్న ఈ వినతిపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, సమాచార-ప్రసారశాఖ మంత్రి, సంబంధిత అధికారులు స్పందించాలని ఆ ప్రకటనలో కోరారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.